# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 153 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

18-04-2026 శనివారం వెల : 1/- పేజీలు : 4


## జనగణనపై అవగాహన కలిగి ఉండాలి

- స్వీయ-గణన ఏప్రిల్ 16 నుండి 30 వరకు
- మే నాటికి ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి
- దేశానికి స్వీయ జనగణన అవసరం
- జిల్లా కలెక్టర్, ముఖ్య జనగణన అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం -శ్రీకాకుళం**

జనగణన పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, ముఖ్య జనగణన అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, ఉద్యోగులతో శుక్రవారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ-గణన ఏప్రిల్ 16 నుండి 30 వరకు ఉంటుందన్నారు. దేశానికి స్వీయ గణన ఎంతో అవసరమన్నారు. మొబైల్ ఏప్ (టెక్నాలజీ) వాడుకొనే జనగణనాన్ని ముందుకు తీసుకువెలతామన్నారు. ప్రతీ ఇంటి నుండి జనగణన ఉండాలన్నారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల నుండి వారి -మిగతా 2లో



## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి ముందు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన...

- కాపు వీధిలో డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలపై ఎమ్మెల్యే ఎంజీఆర్ సంయుక్త తనిఖీ...
- ప్రజలకు పారదర్శక సేవలందించేందుకు ముందస్తు చర్యలు

**నవతరం -పాతపట్నం**



పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని కాపు వీధిలో మే నెలలో జరగనున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, సంబంధిత రైతుల డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు శ్రీ మామిడి గోవిందరావు గారు, టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) గారితో కలిసి సంబంధిత రైతులను సందర్శించి, గ్రామ మరియు మండల స్థాయి అధికారులచే నిర్వహించిన పరిశీలన విధానాన్ని సమీక్షించారు. పాస్ పుస్తకాల జారీ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా, అర్హులైన ప్రతి పట్టాదారుడికి న్యాయం జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారు అధికారులకు ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా మరియు వేగవంతంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.డి.ఏ కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు...

## రేపు జిల్లావ్యాప్తంగా 'జలం-జీవం'..

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు

**నవతరం -శ్రీకాకుళం**




జిల్లావ్యాప్తంగా శనివారం (ఏప్రిల్ 18న) 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 'జలం - జీవం' అనే నినాదంతో నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వేసవి దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న వర్షపు నీటి ఇంకుడు గుంతలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు.

అలాగే చెరువులు, కుంటలు వంటి జలవనరుల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మురుగునీటి నిర్వహణలో భాగంగా ఇంటింటికీ ఇంకుడు గుంతల ఏర్పాటును ప్రోత్సహించాలని, శుద్ధి చేసిన నీటిని మొక్కలకు పోసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాలను ఫొటోలు, వీడియోలతో సహా సా సా' యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, పనుల నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లా నోడల్ అధికారిగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారని ఆయన వెల్లడించారు.

## వరకట్న రహిత సమాజమే లక్ష్యం కావాలి

- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి హరిబాబు

**నవతరం -శ్రీకాకుళం**



వివాహానికి ముందుగానీ, పెళ్లి సమయంలో లేదా ఆ తర్వాత కూడా ధన, వస్తు రూపాల్లో కట్నం డిమాండ్ చేయడం చట్టరీత్యా కఠినమైన నేరమని, ఇలాంటి వేధింపులకు పాల్పడే వారికి జైలు శిక్ష తప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు హెచ్చరించారు. శుక్రవారం కిల్లిపాలెం గ్రామంలో నిర్వహించిన వరకట్న నివారణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరకట్న వేధింపులకు గురవుతున్న మహిళలు అధైర్యపడకుండా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. బాధితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయిస్తే, నిష్ణాతులైన కౌన్సిలర్ల ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా కిల్లిపాలెం గ్రామాన్ని వరకట్న రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని గ్రామస్తులందరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి ఎన్. సునీత మాట్లాడుతూ..

ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలని, చట్టం ఎప్పుడూ బాధితుల పక్షాన ఉంటుందని పేర్కొన్నారు. దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. నారిమణి మాట్లాడుతూ.. కట్నం కోసం వేధించే వారిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. శశికళ, వై. హిమబిందు, డి. దేవభూషణరావు, మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు సీఐటీయూ డిమాండ్
- పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి
- లేబర్ కోడ్ల రద్దు కోరిన పనస రమేష్
- సిరుసువాడలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం

2లో




## సంజీవరావు సేవలు వెలకట్టలేనివి



**నవతరం- శ్రీకాకుళం**

స్టార్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 కేబినెట్ సెక్రెటరీ గా మూడు సార్లు పనిచేసి అందరి అభిమానాన్ని సంపాదించుకున్న సుగంధం సంజీవరావు అజాత శత్రువుగా పేరు గాంచారు అని.. వాకర్స్ ఉద్యమానికి ఆయన చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు కొనియాడారు... శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సంజీవరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు..ముందుగా ఫ్రూట్ కట్ చేసి జన్మదిన వేడుకలు ప్రారంభించారు.. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గేదెల ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ... స్టార్ వాకర్స్ క్లబ్ మూలధనం సేకరణలో.. మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు -మిగతా 4లో

## బద్వేలు టీడీపీ ఇన్చార్జ్‌గా సూర్యనారాయణరెడ్డి?

- నియామకం జరిగితే తిరుమలకు పాదయాత్రలంటూ నాయకుల మొక్కుబడి
- బద్వేలు టీడీపీలో ఇన్చార్జ్ మార్పుపై జోరుగా చర్చ
- డీసీసీబీ చైర్మన్ పేరుకు కేడర్ మద్దతు
- వారం రోజుల్లో అధికారిక ప్రకటనపై ఉత్కంఠ



ఎడిటోరియల్

# పునర్'వివక్ష'!

పార్లమెంటు, అసెంబ్లీ నియోజవర్గాల పునర్విభజన అంశం దక్షిణాది రాష్ట్రాలను ఆందోళనకు గురిచేసున్నది. ప్రస్తుతమున్న సీట్లకి అదనంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్లను పెంచే పనికి కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు తెరలేపింది. ఇందుకోసం త్వరలో ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేయనుంది. కాగా ఇప్పుడిదో పెద్ద రాజకీయ వివాదంగా మారే అవకాశంగా కనిపిస్తోంది. ఇది దక్షిణాది రాష్ట్రాల ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తోంది.

కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థవంతంగా అమలుచేసి జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఇప్పుడదే ఆ రాష్ట్రాలకు పెనుశాపంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాత 2011 జనాభా లెక్కల ప్రకారం చేయడమే ఇందుకు ముఖ్య కారణం. జనాభా నియంత్ర ణలో వెనుకబడ్డ ఉత్తరాది రాష్ట్రాలు ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనలో మాత్రం సీట్లను అధికంగా పొంది భారీగా ప్రజా ప్రాతి నిధ్యాన్ని దక్కించుకోనున్నాయి. ఈ విష యంలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్య మంత్రుల నుంచి కేంద్రంపై తీవ్ర విమర్శలు వస్తు న్నాయి. ఈ రకంగా సీట్లను పెంచితే దక్షిణాది రాష్ట్రాలు 24 శాతం నుంచి 19 శాతానికి పడిపోతాయనే భయాందోళనలు నెల కొన్నాయి. ఈ నేపథ్యంతో తెలంగాణ ముఖ్య మంత్రి హైబ్రీడ్ మోడల్‌ను ప్రతిపాదించారు. యాభై శాతం పెరుగుదలతోపాటు మరో యాభై శాతం రాష్ట్రాల ఆర్థికాభి వృద్ధి ప్రాతిపదికన పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి లేఖ రాశారు.

తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణతోపాటు ఉత్తరాదిలోని ఢిల్లీ, పంజాబ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గనుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఆదేశాలను అమలు చేయడం మూలంగా తాము శిక్షంచబడుతున్నామనీ, అదే సమయంలో అధిక జనాభా పెరుగుదల ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు లభిస్తున్నాయని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు వ్యాఖ్యానిస్తున్నారు.

దక్షిణాదిని పక్కనబెట్టి ఉత్తరాది ఓట్లు, సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితులు తాజా డీలిమి టేషన్‌తో ఏర్పడతాయని అభిప్రాయ పడు తున్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి 'బీమారు' రాష్ట్రాలు భారీగా లాభపడొచ్చని రాజకీయ విశ్లేషకులు అంటు న్నారు. కాగా దక్షిణాదిలో కేరళం వంటి రాష్ట్రంలో అసలు నియోజక వర్గాల పెంపు ఉండకపోవచ్చు. దీంతో అన్నిరంగాల్లో ముందున్న కేరళం గొంతు పార్లమెంటులో పరిమితమయ్యే దారుణ విధానానికి కేంద్రం శ్రీకారం చుట్టడాన్ని మేధావులు తప్పు బడుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల నిధులతోపాటు రాజకీయంగా కేంద్రం చిన్నచూపు చూస్తున్నదనే విమర్శలూ లేకపోలేదు.

ఈ ప్రక్రియ తాజా జనగణనతో ముడిపడి ఉంది. ఈ వివాదం సమాఖ్య ప్రాతినిధ్యం, ప్రాంతీయ ఆర్థిక సముతుల్యతపై ముంచుకొస్తున్న ప్రమాదాన్ని తెలియజేస్తున్నది. జనాభా నిర్వహణలో పురోగతి సాధించ దమనేది రాజకీయ ప్రాముఖ్యతకు నష్టం కలిగించకూడదని దక్షిణ ప్రాంత నేతల అభిప్రాయంగా ఉంది. 2011 లెక్కల నేపథ్యంలో ప్రొరెటా ప్రకారం లోక్‌సభ సీట్లు 543 నుంచి 816కు పెరగనున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 140 నుంచి 170కి, లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు చేరనున్నాయి. ఇకపోతే దక్షిణాదిలో లోక్‌సభ సీట్లు 130 నుంచి 195 అవుతుండగా, అదే ఉత్తరాదికి 413 నుంచి 621 సీట్లు పెరుగుతాయి. అంటే దక్షిణాదికి, ఉత్తరాదికి మధ్య 426 సీట్ల తేడా వస్తుంది. దక్షిణాదితో సంబంధం లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఏర్పడుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు నష్టం చేస్తుందనేది రాజకీయవేత్తలు, మేధావుల వాదన.

2029 ఎన్నికల నుంచే వీటిని అమల్లోకి తీసుకురా వాలని కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నది. ఇదే గనక జరిగితే దక్షిణాది రాజకీయ ప్రాభవాన్ని కోల్పోనుంది. అలాగే హిందీ రాష్ట్రాల పలుకుబడి మరింత బలోపేతమ వుతుంది. చట్టసభల్లో సీట్ల పెంపు వ్యవహారంపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, ఆయా రాష్ట్రాల అసెంబ్లీలను సంప్రదించకుండా నేరుగా పార్ల మెంటు ద్వారా డీలిమిటేషన్ కమిషన్ నివేదికను ఆమోదించి అమలు చేయాలనే ఆలోచన సరికాదు. దక్షిణ, తూర్పు రాష్ట్రా లకు నష్టంచేసే పునర్విభజన ప్రతిపాదనలను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడిచేలా ఈ ప్రతిపాదనలున్నాయని వ్యాఖ్యానిస్తున్నాయి. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో విస్తృత సంప్రదింపుల తర్వాతే డీలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తీసుకు పోవాలని కోరు తున్నాయి. అందరూ సూచిస్తున్నట్టుగా ఏకాభిప్రాయంతో కూడిన విధానాన్ని కేంద్రం పున: పరిశీలించడం చాలా అవసరం.

# "చెట్టుగా మారిన తల్లి... మనసును కదిలించే నిజం"

ఒకప్పుడు పచ్చని కొండల మధ్యలో, గాలికి పాటలు పాడే అడవిలో ఒక అద్భుతమైన శిల్పం ఉండేది. ఆ శిల్పం సాధారణం కాదు అది ఒక "జీవం ఉన్న తల్లి".

ఆమె పేరు వనమాత.

వనమాత తన ఒడిలో చిన్న పసిబిడ్డను ఎత్తుకుని ఉండేది. ఆమె శరీరం మొత్తం వేర్లతో, కొమ్మలతో కలిసిపోయి ఉండేది. ఆమె కాళ్లు నేలతో కలిసిపోయి, చెట్టు లా మారిపోయాయి. ఆమె చేతులు బిడ్డను కౌగిలించుకుని, ఒక పెద్ద చెట్టు కొమ్మలుగా విరబూశాయి.

అది కేవలం శిల్పం కాదు... ఒక కథ.

ఏళ్ల క్రితం, ఆ అడవిలో ఒక చిన్న గ్రామం ఉండేది. ఆ గ్రామంలో సితార అనే యువతి ఉండేది. ప్రకృతిని ఎంతో ప్రేమించే అమ్మాయి. పూలతో మాట్లాడేది, చెట్లతో నవ్వేది.

ఒక రోజు, గ్రామంలో పెద్ద కరువు వచ్చింది. నీళ్లు లేక, పంటలు ఎండిపోయాయి. ప్రజలు ఒక్కొక్కరుగా గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారు.

కానీ సితార మాత్రం వెళ్లలేదు.

ఆమె ఒడిలో ఒక చిన్న పసిబిడ్డ. "ఈ నేలే నా బిడ్డ భవిష్యత్తు" అని ఆమె నమ్మింది.

తల్లి త్యాగం

రోజులు గడిచాయి. ఆకలి, దాహం ఆమెను బలహీనంగా చేసాయి. కానీ ఆమె ఒక్కటే ఆలోచించింది. తన బిడ్డ బతకాలి.

అప్పుడు ఆమె ఒక నిర్ణయం తీసుకుంది.

"నేను చెట్టుగా మారితే... నా బిడ్డకు నీడ, గాలి, ఆహారం లభిస్తాయి" అని.

ఆమె ప్రకృతిని ప్రార్థించింది.

ఆమె ప్రేమను చూసి ప్రకృతి కరిగిపోయింది.

అలా సితార నెమ్మదిగా చెట్టుగా మారిపోయింది.

ఆమె కాళ్లు వేర్లయ్యాయి. చేతులు కొమ్మలయ్యాయి. గుండె మాత్రం తల్లి గానే నిలిచింది.

అద్భుతం

కాలం గడిచింది. ఆ చెట్టు పెద్దదైంది. దాని నీడలో పక్షులు నివసించాయి. పండ్లు పుట్టాయి. వర్షం వచ్చింది.

ఆమె ఒడిలో ఉన్న బిడ్డ ఆ చెట్టు నీడలో పెరిగి పెద్దవాడయ్యాడు.

అతడు ఆ చెట్టును చూసి ఎప్పుడూ ఒక అనుభూతి పొందేవాడు "ఇది నా తల్లి" అని.

ఆ శిల్పం మనకు ఒక విషయం చెబుతుంది:

"తల్లి ప్రేమకు పరిమితులు లేవు. ప్రకృతి కూడా తల్లే."


మనమేం చేస్తున్నామో మనమే చూసుకోవాలి.

చెట్లను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయి.

ఈరోజు కూడా ఆ అడవిలో ఆ శిల్పం నిలిచే ఉంది.

వనమాత తన బిడ్డను చూస్తూ నిశ్శబ్దంగా ప్రేమను పంచుతుంది.

ఎవరైనా ఆ శిల్పాన్ని చూసినప్పుడు, వారి మనసులో ఒక ప్రశ్న మిగులుతుంది:



"మన తల్లిని... మన ప్రకృతిని... మనం ఎలా చూసుకుంటున్నాం?"

రాసినోడు :
తేరాల రాజేందర్ ప్రసాద్ గుప్తా
బాబు జగ్జీవన్ రామ్ నగర్,
హైదరాబాద్ 500037
చరవాణి : 9297109223

# బద్వేలు టీడీపీ ఇన్చార్జ్‌గా సూర్యనారాయణరెడ్డి?

**నవతరం బద్వేలు**

కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలో టీడీపీ ఇన్చార్జ్ మార్పుపై రాజకీయ చర్చలు వేడెక్కాయి. డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డిని బద్వేలు టీడీపీ ఇన్చార్జ్‌గా నియమిస్తే తిరుమలకు పాదయాత్రలు చేస్తామని పలువురు నాయకులు, కార్యకర్తలు శ్రీ వెంకటేశ్వరస్వామికి మొక్కుబడులు పెట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయం ప్రస్తుతం నియోజకవర్గంలో వైరల్‌గా మారింది.


గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పలువురు టీడీపీ శ్రేణులు సూర్యనారాయణరెడ్డి నియామకం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బద్వేలు టీడీపీలో ఇన్చార్జ్ అంశంపై గత కొంతకాలంగా తీవ్ర చర్చ కొనసాగుతోంది.

ప్రస్తుత ఇన్చార్జ్ రితీష్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి మధ్య ఇన్చార్జ్ పదవిపై గత ఆరు నెలలుగా పోటీ నెలకొన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో సూర్యనారాయణరెడ్డికి అనుకూల ఫలితాలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

ఇదిలా ఉండగా, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్ రెడ్డి వర్గానికి వ్యతిరేకంగా ఉన్న పలువురు నాయకులు ప్రస్తుతం సూర్యనారాయణరెడ్డి వైపు చేరుతున్నారని సమాచారం. దీంతో బద్వేలు టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

రాబోయే వారం రోజుల్లో బద్వేలు కొత్త ఇన్చార్జ్‌పై పార్టీ అధిష్టానం అధికారిక ప్రకటన చేసే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. దీంతో సూర్యనారాయణరెడ్డి అనుచరుల్లో ఉత్సాహం నెలకొంది.

# రాజీ మార్గమే రాజ మార్గం
# సంబంధిత అధికారులతో సమావేశం



సీనియర్ సివిల్ జడ్జ్ యు. మాధురి

**నవతరం టెక్కలి**

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి సహకరించండి అని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి యు. మాధురి వారి ఆధ్వర్యంలో టెక్కలిలో తే 09.05.2026 ది శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీకి అందరూ సహకరించాలని, టెక్కలి కోర్టుల పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు పోలీసులు అంత సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టెక్కలి, నందిగాం మెలియాపుట్టి పోలీసు వారు మరియు ఎక్సైజ్ పోలీసు వారు పాల్గొన్నారు.

# జనగణనపై అవగాహన కలిగి ఉండాలి

మొదటిపేజీ తరువాయి

వారి కుటుంబాలన్నీ నమోదు చేసుకోవాలన్నారు. ఇతరులకూ అవగాహన కల్పించాలని వివరించారు. ప్రతీ ఇంటికి మెసేజ్ పంపినట్లు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ వెబ్ సైట్ https://se.census.gov.in/ లోకి వెళ్లి వారి జనగణన నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జనగణన దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భారత జనాభా లెక్కల సేకరణలో భాగంగా, ఈసారి ప్రజలు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో (్రావశ్రీట- జుఅబఎవతీఱ్‌అశీఅ) నమోదు చేసుకునే సువర్ణ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. జనగణనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మొత్తం 4291 హౌస్ లిస్టింగ్ బ్లాక్ లను గుర్తించగా హౌస్ లిస్టింగ్ బ్లాక్ లు సృష్టి ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందన్నారు. జిల్లాలో 3813 ఎన్యూమరేటర్లు, 624 సూపర్ వైజర్లను ఉన్నట్లు చెప్పారు. వీరందరికీ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆన్ లైన్ లో స్వయంగా వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత సమయంలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ సదుపాయాన్ని వినియోగించి జనగణన - 2027ను విజయవంతం చేయడానికి ప్రతీ పౌరుడు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జనగణన గూర్చి ఎన్యూమరేటర్లకు ఎలాంటి పత్రాలు చూపించాల్సిన అవసరం లేదన్నారు. వివరాలు గోప్యంగా ఉంచబడుతుందన్నారు. మీరు వివరాలు సమర్పించిన తరువాత ఎస్ఎంఎస్ మరియు ఈ మెయిల్ ద్వారా ఒక ప్రత్యేకమైన పదకొండు అంకెలు ఎస్ఈ ఐడి పొందుతారని చెప్పారు. ఎన్యూరేటర్ వచ్చినపుడు ఎస్ఈ ఐడి మరిచిపోయిన లేదా కోల్పోయి మీ రిజిస్ట్రేషన్ అయిన మొబైల్ నంబర్ తో ఐడి పొందవచ్చన్నారు. తదుఆఎన్యూమరేటర్ మీగృహానికి వచ్చా మి సమాధానం ను గుర్తించి మీ డేటాను అప్ లోడ్ చేస్తారు. స్వీయ గణన ముగిసిన తరువాత ఎన్యూమరేటర్ ద్వారా మార్చుకోవచ్చున్నారు. మే నాటికి పూర్తి కావలసి ఉందన్నారు.

ఈ నెల 15 నుండి విస్తృత స్థాయి ప్రచారం

15-ఏప్రిల్: జిల్లా కలెక్టర్లు / రెవెన్యూ బాధ్యత వహించే అధికారులు:
మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ/ఎంపీపీ చైర్‌పర్సన్‌లు, స్థానిక ప్రతినిధులు

16-ఏప్రిల్: బాధ్యత గల అధికారులు :
కార్యదర్శులు/విభాగాధిపతులు / జిల్లా కలెక్టర్లు :
సచివాలయ సిబ్బంది, విభాగాధిపతుల కార్యాలయాలు, జిల్లా - మండల సిబ్బంది

17-ఏప్రిల్: బాధ్యత గల అధికారులు :
సమాచార-పురపాలక శాఖ కమిషనర్ / జిల్లా కలెక్టర్లు
ప్రముఖ వ్యక్తులు, సెలబ్రిటీలు, సాంస్కృతిక ప్రముఖులు

18-ఏప్రిల్: బాధ్యత గల అధికారులు :
ఎస్ఈఆర్పీ/ఎంఈపీఎంఏ

ఐకాన్స్ స్వయం సహాయక బృందాల సభ్యులు - డ్రైవ్ 1

19-ఏప్రిల్: బాధ్యత గల అధికారులు :
ఎస్ఈఆర్పీ/ఎంఈపీఎంఏ
స్వయం సహాయక బృందాల సభ్యుల డ్రైవ్ 1 (కొనసాగింపు)

20-ఏప్రిల్: పురపాలక ఒ గ్రామీణాభివృద్ధి శాఖ:
ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యకర్తలు - డ్రైవ్ 1

21-ఏప్రిల్: ఎస్జీఎస్డబ్ల్యూ శాఖ:
గ్రామ ఒ వార్డు సచివాలయ సిబ్బంది
పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు (సిబ్బంది - విద్యార్థులు)

22-ఏప్రిల్: పాఠశాల ఒ ఉన్నత విద్యా శాఖలు:
అంగన్‌వాడీ, ఏఎన్ఎంఎస్, ఆశా కార్యకర్తలు ఒ లబ్ధిదారులు

23-ఏప్రిల్: మహిళా శిశు అభివృద్ధి -ఆరోగ్య శాఖ 24-ఏప్రిల్ : గిరిజన సంక్షేమ శాఖ:
గిరిజన నివాసాలు - ప్రాంతాలు

25-ఏప్రిల్: పురపాలక - పట్టణాభివృద్ధి శాఖ:
ఆర్‌డబ్ల్యుఏలు, వృద్ధాశ్రమాలు

26-ఏప్రిల్: జిల్లా పరిపాలన:
జనాభా గణన 5కే పరుగు (అవగాహన కార్యక్రమం)

27-ఏప్రిల్ : కార్మిక ఒ ఆర్థిక శాఖలు:
దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలు, బ్యాంకులు

28-ఏప్రిల్ : ఎస్ఈఆర్‌పి/ఎంఈపిఎంఏ
ఎస్‌హెచ్‌జి సభ్యులు - డ్రైవ్ 2

29-ఏప్రిల్: పోలీస్ శాఖ
పోలీస్ సిబ్బంది

30-ఏప్రిల్: పిఆర్ఒఆర్‌డి శాఖ
ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కార్యకర్తలు - డ్రైవ్ 2

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**నవతరం కొత్తూరు**

కొత్తూరు మండలంలోని సిరుసువాడ గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ప్రతి కార్మికుడికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కామేశ్వరరావు, గోవింద్, రామారావు, సుభాష్, శ్రీరాములు, కృష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తిరువిడైమరుదూర్ - తమిళనాడు...
# శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయం



తిరువిడైమరుదూర్ శ్రీ మహా లింగేశ్వర స్వామి ఆలయం తమిళనాడు లో కుంభకోణం సమీపంలో ఉన్న అత్యంత ప్రాచీనమైన ప్రసిద్ధ శైవ క్షేత్రం. ఈ ఆలయాన్ని "మధ్యా ర్జునశీ" అని కూడా పిలుస్తారు. శ్రీశైలంకు దక్షిణాన ఉన్న ఈ క్షేత్రానికి మధ్యలో ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. మహాభారత కాలంలో అర్జునుడు తన తీర్థయాత్రలో భాగంగా ఈ ప్రదేశాన్ని సందర్శించి ఇక్కడ శివుడిని పూజించాడని పురాణాలు చెబుతున్నాయి ఇది పంచ క్రోశ స్థలంలో ఒకటిగా పరిగణించబడుతుంది.

తిరువిడైమరుదూర్ శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయంను "మధ్యార్జునం" అని కూడా పిలుస్తారు. ఈ ఆలయం శివుడికి అంకితం చేయబడినది. ఈ ఆలయంలో శివుడు మహాలింగేశ్వరుడు. ఈ ఆలయం చాలా పెద్దది. ఆలయంకు తగ్గట్లే ఆలయంలో ఉన్న శివలింగం కూడా చాలా పెద్దగా ఉండి భక్తులకు దర్శనమిస్తారు. శ్రీ బృహత్ సుందర గుజాంబాల్ సమేత శ్రీ మహాలింగేశ్వర స్వామి వార్లు కొలువైన ఈ ఆలయం తమిళనాడు లోని అతి పెద్ద ఆలయాలలో ఒకటిగా పేరొందినది. దీనిని చోళ రాజులు తొమ్మిదో శతాబ్దంలో నిర్మించారు. ఇది అతి పురాతన ఆలయం. చాలా ప్రశాంతంగా, దర్శకుల మనసులో భక్తిభావం పెల్లుబికేలా ఉంటుంది. దూరం నుండే మహాలింగేశ్వరుని చుట్టూ ఆర్చిలో వెలిగించిన దీపాలు కనులవిందు చేస్తుంటే తాదాత్మ్యంగా స్వామిని దర్శించుకోవచ్చు.

సాధారణంగా శివలింగాన్ని మహాపురుషులు లేదా రాజులు ప్రతిష్టింపజేసి దానికి ఆలయాలను నిర్మిస్తారు. మరికొన్ని చోట్ల స్వయంభువుగా వెలుస్తుంది. అయితే ఇది కొంత అరుదైన విషయం. ఇదిలా ఉండగా దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఒకే ఒక చోట ఆ పరమశివుడు ప్రతిష్టించిన శివలింగం ఒకే ఒక చోట ఉంది. అంతే కాకుండా ఆయన చాలా ఏళ్లపాటు తపస్సు చేసి అలా వచ్చిన శక్తిని శివలింగంలో ప్రవేశపెట్టాడని చెబుతారు. అందువల్లే ఆ శివలింగం భూమి పై ఉన్న అన్ని శివలింగాల కంటే విశిష్టమైనదని చెబుతారు. ఇక ఇక్కడ అరుదుగా కనిపించే తెల్ల మద్ది చెట్లు మనకు కనిపిస్తాయి. తిరువిడైమరుదూర్ ఆలయం ప్రాంగణంలో ఉండే మద్ది చెట్టుకి ప్రదక్షిణ చేస్తే చాలా మంచిదని భక్తులు విశ్వాసం. ఇటువంటి మద్ది చెట్లు కేవలం మధ్యార్జునం, శ్రీశైలంలో మాత్రమే ఉన్నాయి.

ఈ ఆలయం పక్కనే భారత దేశంలో అత్యంత అరుదైన దేవాలయాల్లో ఒకటిగా పేర్కొనే మూకాంబిక దేవి ఆలయాన్ని కూడాచూడగలం.

ఈ క్షేత్రం గురించి భారతీయ పురాణాల్లో పేర్కొనబడింది. సృష్టి మొదలయినప్పుడు భక్తులు సేవించుకోవటానికి పరమ శివుడు ఈ లింగాన్ని సృష్టించి, ఆ లింగానికి శక్తిని ప్రసాదించటానికి తాను తపస్సు చేసి, ఆ తపో శక్తిని అందులో ప్రవేశపెట్టి, తానుకూడా అందులో లీనమయ్యాడని. పరమశివుడు స్వయంగా తపస్సు చేసి ఆ శక్తిని ఆ లింగంలో ప్రవేశపెట్టాడంటే అది ఎంతటి మహాద్భుత లింగమో పురాణాల ద్వారా మనం తెలుసుకోవచ్చు.

## మహాలింగస్వామి స్వంభువుడు

అందువల్లే ఈ శివలింగానికి అంతటి శక్తి అని చెబుతారు. ఇక్కడ ఉన్న శివలింగాన్ని మహాలింగస్వామి అని పిలుస్తారు. మహాలింగస్వామి స్వంభువుడు. భక్తితో ఈయన ఆలయానికి ప్రదక్షిణ చేసివారికి ఏ విధమైన మానసిక బాధలైనా తొలగి పోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతేకాదు, వివాహం, పిల్లలు, ఉద్యోగం వగైరా సకల కోరికలూ నెరవేరుతాయట. సప్త విగ్రహ మూర్తులకు మధ్యలో కొలువుతీరిన మహాలింగేశ్వరుడు

ఈయన ఈ ప్రాంతంలోని అన్ని శివాలయాలుకు, సప్త విగ్రహ మూర్తులకు మధ్యలో కొలువుతీరి ఉన్నాడు. చిదంబరంలోని ఉన్న నటరాజ స్వామి ఆలయంలోని నటరాజు, తిరు చెంగళూరులోని చండికేశ్వరుడు, తిరువలంజులిలోని తెల్ల వినాయకుడు, స్వామిమలై లో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాలయాల్లో ఉన్న సూర్యుడు, అలాస్ దేవాలయంలోని దక్షణామూర్తి.

నాలుగు దిక్కుల్లో......

ఇక ఈ దేవాలయానికి చుట్టూ నాలుగు దిక్కుల్లో నాలుగు దేవాలయాలు ఉన్నాయి. అవి తూర్పు వీధిలో విశ్వనాథుడు, పడమట ఉన్న ఋషిపురేశ్వరుడు, దక్షిణ వీధిలో ఉన్న ఆత్మనాధుడు, వీధిలో ఉన్న చొన్ననాధుడు. ఇంతటి విశిష్టమైన దేవాలయంను హిందువులు ఈ క్షేత్రాన్ని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా భావిస్తారు.

## నంది చాలా పెద్దది:

ఆలయ మండపంలో ఉన్న నంది చాలా పెద్దదిగా ఉంటుంది. అయితే దీనిని ఒకే శిలతో చేయబడలేదు. అందువల్ల అంత బరువుగా ఉండదని చెబుతారు. ఈ మహాలింగస్వామికి భక్తితో ప్రదక్షిణ చేస్తే ఏవిధమైన మానసిక బాధలైనా తొలిగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వివాహం, పిల్లలు కావాల్సిన వారు ఎక్కువ మంది ఈ క్షేత్రాన్ని సందర్శిస్తూ ఉంటారు. ఈ ఆలయంలో ప్రవేశ ద్వారం నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి వెళ్లరు. ఒకవేళ అలా చేస్తే బ్రహ్మహత్యా దోషం చుట్టుకుంటుందని చెబుతారు. ఇందుకు సంబంధించి ఒక కథనం ప్రచారంలో ఉంది. ఒకసారిపాండ్య రాజు వరుగుణ పాండ్యన్ అడవిలో వేటకి వెలుతాడు.

తిరిగి వచ్చే సమయంలో చీకటి పడుతుంది. ఆ చీకట్లో అతని గుర్రం ఒక బ్రాహ్మణుడి మీదుగా వెళ్లి అతిని చావుకు కారణమవుతుంది. దీంతో అతనికి బ్రహ్మహత్యా దోషం చుట్టుకుంటుంది. శివ భక్తుడైన పాండు రాజు శివుడిన ప్రార్థిస్తాడు.

## శివుడు కలలలో కనిపించి..

శివుడు కలలో కనిపించి తిరువిడైమరుదూర్ వెళ్లి శివలింగాన్ని దర్శించుకోవాల్సిందిగా సూచిస్తాడు. దీంతో రాజు తిరువిడైమరుదూర్ వెళ్లి తూర్పు ద్వారం గుండా ఆలయ ప్రవేశం చేస్తాడు. అతన్ని అన్ని చోట్లకు వెంటాడుతున్న బ్రహ్మహత్యా దోషం పవిత్రమైన శివాలయంలోకి రాలేక తూర్పు ద్వారం వద్దనే ఉండి పోతుంది.

## బ్రహ్మహత్య దోషం....

ఇక రాజు శివుడిని ఆరాధించే సమయంలో ఒక అశరీర వాణి వినిపిస్తుంది. తూర్పు ద్వారం నుంచి కాక వేరే ద్వారం గుండా వెళ్లమని సూచిస్తుంది. రాజు అలాగే చేస్తాడు. దీంతో ఇప్పటికీ ఆ బ్రహ్మహత్య దోషం అక్కడే ఉందని లోనికి వెళ్లిన వారు ఎవరైనా ఈ ద్వారం గుండా వస్తే బ్రహ్మహత్య దోషం వారికి చుట్టుకుంటుందని చెబుతారు. అర్జునం అంటే మద్ది చెట్టు. ఈ మూడు క్షేత్రాల్లో మాత్రమే అత్యంత అరుదైన మద్ది చెట్టును మనం చూడగలం.

ఆలయాన్ని చేరుకునే మార్గాలు:
రైలు మార్గం: తిరువిడై మరుదూర్ కు కేవలం 9కిలోమీటర్ల దూరంలో కుంబకోసం రైల్వే స్టేషన్ ఉంది. అక్కడి నుండి లోకల్ బస్ సర్వీలు ఉన్నాయి.
రోడ్డు మార్గం : తిరువిడై మరుదూర్ కు కుంబకోణం బస్ స్టాండ్ చాలా దగ్గర. అక్కడి నుండి జిల్లా సర్వీస్ బస్సులు అందుబాటులో ఉంటాయి.
విమాన మార్గం: 98 కిలోమీటర్ల దూరంలో తిరుచురాపల్లి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ఉంది. అక్కడి నుండి బస్సు, టాక్సీ ల ద్వారా తిరువిడై మరుదూర్ చేరుకోవచ్చు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# ఒక సినిమా కోసం వెళ్లి మరో సినిమా ఓకే చేశాడు


సినిమా ఆఫర్లు ఎట్నుంచి ఎలా వస్తాయో, ఎప్పుడు ఏ సినిమా ఓకే అవుతుందో చెప్పలేం అనడానికి ఇదో మంచి ఉదాహరణ. రామాయణ ప్రాజెక్టులోకి యష్, కాకతాళీయంగా వచ్చాడు. ఆ విషయాన్ని అతడే స్వయంగా వెల్లడించాడు. కేజీఎఫ్-2 లాంటి అరివీర భయంకర సక్సెస్ తర్వాత తన ఫోకస్ మొత్తాన్ని టాక్సిక్ సినిమాపైనే పెట్టాడు యష్. ఆ సినిమా గ్రాఫిక్ వర్క్ కోసం తనే ప్రత్యేకంగా లాస్ ఎంజెలెస్ వెళ్లాడు. అక్కడ అనుకోకుండా నిర్మాత నమిత్ మల్హోత్రాను కలిశాడు.
భారతీయ ఇతిహాసాన్ని గ్లోబల్ వేదికపైకి తీసుకెళ్లాలనే ఆలోచనను నమిత్ చెప్పడం, ఆ ఆలోచన నచ్చడంతో యష్ కూడా చేతులు కలిపాడు. ఆ తర్వాత దర్శకుడు నితీశ్ తివారీ, రావణుడి పాత్రను ఆఫర్ చేయడం చకచకా జరిగిపోయాయి. అలా టాక్సిక్ గ్రాఫిక్ వర్క్ కోసం వెళ్లి రామాయణ ప్రాజెక్టు లాక్ చేసినట్టు వెల్లడించాడు యష్. ఈ సందర్భంగా మరో ఆసక్తికర విషయాన్ని కూడా చెప్పుకొచ్చాడు. ఈ దీపావళికి రాబోతున్న రామాయణ పార్ట్-1లో రాముడి పాత్రధారి రణబీర్ కు, తనకు మధ్య ఎలాంటి సన్నివేశాలు లేవని స్పష్టం చేశాడు యష్.
అంటే, అసలు కథ మొత్తం పార్ట్-2లో ఉంటుందన్నమాట. కలిసి నటించకపోయినా, సెట్స్ లో 2-3 సార్లు రణబీర్-యష్ కలుసుకున్నారట. లాస్ వెగాస్ లో జరుగుతున్న సినిమాకాన్-2026 వేడుకలో రామాయణ సినిమాలో కీలక పాత్రధారుల దుస్తుల్ని ప్రదర్శించారు. రాముడు, సీతతో పాటు రావణుడి పాత్రధారి దుస్తులు ఎలా ఉండబోతున్నాయో బయటపెట్టారు.

# చిన్న సినిమాలే కానీ ఆసక్తి రేపుతున్నాయి

ఫలితం సంగతి పక్కనపెడితే, కొన్ని చిన్న సినిమాలు విడుదలకు ముందు మంచి ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. అలా ఆసక్తి రేకెత్తించే సినిమాలన్నీ ఒకేసారి విడుదలైతే మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ఈ వారం బాక్సాపీస్ బరిలో అలాంటి సన్నివేశమే కనిపించబోతోంది.
ఈ వారాంతం తిమ్మరాజుపల్లి టీవీ, పాపం ప్రతాప్, బ్యాడ్ బాయ్ కార్తీక్ సినిమాలు థియేటర్లలోకి వస్తున్నాయి. వీటిలో కాస్త ఫేస్ వాల్యూ ఉన్న సినిమా ఏదైనా ఉందంటే అది బ్యాడ్ బాయ్ కార్తీక్ మాత్రమే. నాగశౌర్య ఇందులో హీరో. కానీ ఆశ్చర్యంగా, ఈ సినిమా కంటే మిగతా 2 చిన్న సినిమాలు ప్రచారంలో ముందున్నాయి.
నిర్మాతగా ఈ సినిమా వస్తోంది. దాదాపు 40 మంది కొత్త వాళ్లు నటించిన సినిమా ఇది. 'క' ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ సినిమాకు మునిరాజు దర్శకుడు. ఇది చాలా చిన్న సినిమా. కానీ ఈ కేటగిరీలో బెంచ్ మార్క్ సెట్ చేస్తుందని చెబుతున్నాడు అబ్బవరం.
ఇక మరో చిత్రం పాపం ప్రతాప్. తిరువీర్ చేసే సినిమాల్లో కథలు బాగుంటాయనే ఇమేజ్ ఇప్పటికే ఉంది. ఆ ఇమేజే ఈ సినిమాకు అతిపెద్ద ప్రచారం. దానికితోడు ట్రయిలర్ ఆకట్టుకోవడం మరో ప్లస్.
ఈసారి తిరువీర్ సినిమాలో తెలిసీతెలియని ముఖాల కంటే, గుర్తుపట్టే ఫేసులే ఎక్కువగా ఉండడం మరో ఆకర్షణ. ప్రచారం సంగతి సరేసరి. పాపం ప్రతాప్ అనే హ్యాష్ ట్యాగ్ తో విపరీతంగా ప్రమోషన్ చేస్తున్నారు.
వీటితో పోలిస్తే కాస్త పెద్ద సినిమానే అయినప్పటికీ, తక్కువ బజ్ తో వస్తున్న సినిమా బ్యాడ్ బాయ్ కార్తీక్ మాత్రమే. నాగశౌర్య హీరోగా నటించిన ఈ సినిమా ట్రయిలర్ కంప్లీట్ యాక్షన్ లుక్ లో ఉంది. అందుకే మిగతా సినిమాలతో పోలిస్తే, ప్రస్తుతానికి రొటీన్ అనిపించుకుంది. థియేటర్లలోకి వచ్చిన తర్వాత ఎలా ఉంటుందో చూడాలి.
ఇలా ఈ వీకెండ్ దేనికవే డిఫరెంట్ జానర్స్ లో 3 సినిమాలొస్తున్నాయి. మరో 2-3 చిన్న సినిమాలు కూడా వస్తున్నప్పటికీ, ప్రధానంగా అందరిచూపు ఈ మూడింటిపైనే ఉంది.







# మోహన్‌కు రాష్ట్ర కీలక పదవి




- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు
- సామాజిక సేవలకు గుర్తింపుగా కీలక అవకాశం
- జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న యువ నాయకుడు
- సంస్థ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం

**నవతరం-శ్రీకాకుళం**


ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ వైస్ చైర్మన్‌గా గంటెడ మోహన్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఉత్తరాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థల ఫోరం వ్యవస్థాపకుడు, టీపాక్ అధ్యక్షుడు, నాన్ పొలిటికల్ జేఏసీ సభ్యుడిగా సేవలందిస్తున్న ఆయనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఉత్తరాంధ్రతో పాటు దేశవ్యాప్తంగా వేలాది స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లతో మోహన్ కుమార్‌కు సన్నిహిత అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో కౌన్సిల్ కార్యక్రమాల విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారని నాయకులు తెలిపారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం లో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో 2021లో వర్సిటీ టాపర్‌గా నిలిచిన మోహన్ కుమార్, కరోనా సమయంలో చేసిన సేవలకు గాను జాతీయ స్థాయిలో 'ఫరెవర్ స్టార్ ఇండియా' అవార్డు అందుకున్నారు. అలాగే జాతీయ 'కర్మవీర్ చక్ర' అవార్డు కూడా ఆయనకు లభించింది.

ఈ సందర్భంగా ఏపీ చైర్మన్ అంబూరు సిందూజ, సెక్రటరీ జనరల్ అంబూరు మల్లికార్జునరావు మాట్లాడుతూ మోహన్ కుమార్ సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఆయన నియామకంతో సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా మరింత మంచి పేరు తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాగ్నిజెంట్ కు 13 మంది కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక



**నవతరం-శ్రీకాకుళం**




స్థానిక శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ రోడ్ లో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల కో ఎడ్ బ్రాంచ్ విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ అయిన కాగ్నిజెంట్ కు 13 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ యన్ వీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా యన్వీ. వేణుగోపాల్ మాట్లాడుతూ డిగ్రీ తో కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సాఫ్ట్ వేర్ దిగ్గజ సంస్థ కు తమ కళాశాల కు చెందిన 13 మంధి ఫైనల్ ఇయర్ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న బంగారు భార్గవి, సేనాపతి రక్షిత, నుల్లు సాయి తేజస్విని, కిల్లం శెట్టి దివ్య, గుడ్ల వర్ష ,వాసుపల్లి గౌతమి, నూర్ భాషా యాస్మిన్ చాంద్ భాషా, గండిరెడ్డి మహా శ్రీ, హిమాన్షి పరేక్, తోనంగి తేజ, వట్టి కార్తీక్, కసరపు వంశీకృష్ణ, అనుపోజు జయకృష్ణ ఎంపికయినట్లు, ఇధి తమ కళాశాల ఇచ్చే క్యాంపస్ రెక్రూట్మెంట్ ద్వారా సాధ్యమైందని తెలిపారు.

అనంతరం ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డా.సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ వీ యల్ నాయుడు మాట్లాడుతూ తమ ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే క్యాంపస్ ఇంటర్వ్యూ లకు తగిన శిక్షణ అందిస్తున్నామని, క్యాంపస్ ఇంటర్వ్యూ లకు అవసరమైనటువంటి కోడింగ్, అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్, కమ్యూనికేషన్ వంటి అంశాలలో ప్రత్యేక శిక్షణ ద్వారా తమ కళాశాల విద్యార్థులు ప్రముఖ మల్టీ నేషనల్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక కాగలుగుతున్నారని, ఆదిత్య డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ ప్రణాళికతో అత్యుత్తమ అధ్యాపకులచే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ అందిస్తున్నామని తద్వారా వారి ప్రతి కంపెనీలో ఉద్యోగాలలో కూడా విజయం సాధించగలుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా ఎన్. శేషారెడ్డి , డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్ రాజు, అధ్యాపక బృంధం విద్యార్థులను అభినందించారు.

# కళ్యాణ తిరుమలలో ఉచిత యోగా శిక్షణ

- శ్రీకాకుళంలో శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహణ
- ఏప్రిల్ 19న ఉదయం మహిళలు, పురుషులకు ప్రత్యేక తరగతులు
- సైతాల దేవలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ
- ఆసక్తిగల వారు పాల్గొనాలని నిర్వాహకుల పిలుపు



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కళ్యాణ తిరుమలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ఆదివారం, ఏప్రిల్ 19, 2026న ఉదయం 6 గంటల నుండి 6.45 గంటల వరకు మహిళలు మరియు పురుషులకు యోగా శిక్షణ ఇవ్వబడుతుందని వెల్లడించారు. ఈ శిక్షణను శ్రీమతి సైతాల దేవలక్ష్మి అందించనున్నారు. ఆరోగ్య పరిరక్షణ, మానసిక ప్రశాంతత కోసం యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, ఆసక్తి గల మహిళలు, పురుషులు ఈ ఉచిత శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# ఐతం విద్యార్థుల "దాస్" టీజర్ విడుదల



- టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో టీజర్ ఆవిష్కరణ
- డైరెక్టర్ ప్రొ. వి.వి. నాగేశ్వరావు చేతుల మీదుగా విడుదల
- సినీ రంగంలోనూ ప్రతిభ చాటాలని విద్యార్థులకు సూచన
- చిత్రబృందాన్ని అభినందించిన అధ్యాపకులు

**నవతరం టెక్కలి**

టెక్కలిలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన "దాస్" చలనచిత్ర టీజర్‌ను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు కళాశాల ఆవరణంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యలోనే కాకుండా సినీ రంగంలో కూడా తమ ప్రతిభను చాటుకుని స్థిరపడే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. నేటి చిత్ర పరిశ్రమలో ప్రముఖ స్థానం సంపాదించిన వారిలో చాలామంది ఇంజనీరింగ్ విద్యాభ్యాసం చేసిన వారేనని గుర్తుచేశారు. సాంకేతిక విద్యతో పాటు సృజనాత్మక రంగాల్లోనూ ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులే స్వయంగా కథ, దర్శకత్వం, చిత్రీకరణ వంటి విభాగాల్లో పాల్గొనడం అభినందనీయమని, ఇలాంటి ప్రయత్నాలు భవిష్యత్తులో విశాలమైన అవకాశాలను అందిస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, డా. పి. మురళీధర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొని చిత్రబృందాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే కాకుండా, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల మేలుకోసం జేసీఐ శ్రీకాకుళం మెయిన్

- జేమ్స్ వైద్యులు మహమ్మద్ షోయబ్




**నవతరం-శ్రీకాకుళం**

ప్రజల మేలుకోసం జేసీఐ శ్రీకాకుళం మెయిన్ పరితపిస్తుందని, రాగోలు జెమ్స్ వైద్యులు, జనరల్ ఫిజిసియన్ మహమ్మద్ షోయబ్ అన్నారు. స్థానిక చైతన్య సహకార జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన పాల్గొని, నిత్య మజ్జిగ కార్యక్రమంలో పాల్గొని, ప్రజల దాహార్తిని తీర్చి మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రం ఆహ్లాదకరమని, వేసవిలో సంపూర్ణ ఆరోగ్యానికి చలివేంద్రాలు ధార్మికమని తెలిపారు. నెల రోజులు కొనసాగే ఈ మజ్జిగ సేవా కార్యక్రమంలో నేను కూడా పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వ్యవస్థాపకులు డా. జామి.భీమశంకర్, అధ్యక్షురాలు తమ్మినేని ఉషారాణి బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. ఈ రోజు జూనియర్ జెసి హర్షిత సహకారం అందించటం గొప్ప విషయమన్నారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ, కార్యదర్శి జామి.కృష్ణకాంత్, కోశాధికారి జగదీశ్, నిత్య సహాయకులు గిరి, పి.హారతి తదితరులు పాల్గొన్నారు.

# సంజీవరావు సేవలు వెలకట్టలేనివి

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటు లో సంజీవరావు చేసిన సేవలు మరువలేనివి అని కొనియాడారు.. మూడు సార్లు వరుసగా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కేబినెట్ సెక్రటరీ గా పనిచేసే అవకాశం ఒక్క సంజీవరావు కు మాత్రమే దక్కిందని ఏరియా వైస్ ప్రెసిడెంట్ పీజీ గుప్తా.. మాజీ గవర్నర్ కొంఖ్యాన మురళీధర్ .. శాసపు జోగినాయుడు లు అన్నారు.. గడిచిన దశాబ్ద కాలంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రగతికి బాటలు వేసే వారిలో సంజీవరావు ఒకరని.. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వర ప్రసాద్ అన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ లో పదవీ విరమణ అనంతరం ఆరోగ్యం కోసం వాకర్స్ క్లబ్ లో చేరి ఎంతో మంది ప్రముఖులను కలుసుకునే అవకాశం దొరికిందని భవిష్యత్తులో వాకర్స్ సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని సంజీవరావు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు..

ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలీ ఉమా మహేశ్వర రావు.. గేదెల లక్ష్మీ. గుడ్ల జగ్గారావు.. గుడ్ల గోపాలరావు.. ఐకె రావు.. చలపాక సూర్యారావు.. ఎన్. ఈశ్వరరావు.. గద్దిబోయిన కృష్ణ.. బొడ్డేపల్లి ప్రసాదరావు.. కొమ్ము శ్రీనివాసరావు.. తదితరులు పాల్గొన్నారు.. అంతకన్నా ముందు స్టార్ వాకర్స్ క్లబ్ లో నూతనంగా సభ్యులు గా చేరిన ముగ్గురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు..వారికి స్టార్ వాకర్స్ క్లబ్ నియమ నిబంధనలు వివరించారు..

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**